క్లుప్తంగా

కోపూరి రజనీకి అభినందన



పొన్నూరు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందిన కోపూరి రజనీని రచయిత, కవి కత్తి పద్మారావు సన్మానించారు. పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో రజని సోమవారం కత్తి పద్మారావును కలిశారు. ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.మధుబాబు పర్యవేక్షణలో ఆమె గర్ల్ చైల్డ్ డొమెస్టిక్ వర్కర్స్- ఆర్థిక స్థితిగతులపై విశ్లేషణ అనే అంశంపై అనేక గ్రంథాలయాలకు వెళ్లి, ఎంతోమందిని విచారించి పరిశోధించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. రజని పరిశోధన దేశానికెంతో ఉపయుక్తం అవుతుందని మాతా రమాబాయి అవార్డు గ్రహీత స్వర్ణకుమారి అన్నారు. కార్యక్రమంలో కత్తి నళిని, కత్తి చేతన్, తలకాయల అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచిగా, శుచిగా ఆహారం అందించాలి



చినలింగాయపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికీ రుచిగా, శుచిగా సరిపడా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ సూచించారు. మండలంలోని చినలింగాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపండి



పొన్నూరు: ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలు త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు ఐదు, మున్సిపాలిటీకి రెండు, ఇరిగేషన్ సంబంధించి ఒక అర్జీ వచ్చింది. వీటి పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చొరవ చూపించాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి ఏప్రిల్ 13న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభ, సేవలకు గుర్తింపుగా ప్రదానం చేయనున్న ఉగాది పురస్కారాలకు అర్హులైన వారు ఈనెల 31లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్ -15కు తమ సేవలను తెలియజేసే సర్టిఫికెట్ల ఫొటోస్టాట్ కాపీలు, పత్రికల క్లిప్పింగ్స్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుకు జతపర్చి పంపాలని సూచించారు. ఎంపికైన వారికి ఏప్రిల్ 13న హైదరాబాద్‌లో 20వ ఉగాది పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

గంజాయి కేసులో జైలు

గుంటూరు లీగల్: గంజాయి కేసులో నిందితుడికి ఆరునెలల జైలు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఒకటో జిల్లా కోర్టు జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం.. తాడేపల్లి మండలం నులకపేటలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు 2017లో జరిపిన తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న చాదల కృష్ణ, దావు క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి మంగళగిరి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.బాలయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఒకటో జిల్లా కోర్టు జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతి శిక్ష ఖరారు చేశారు. మొదటి ముద్దాయి కృష్ణ మృతి చెందగా రెండో ముద్దాయి దావు క్రాంతికుమార్ ఆరునెలలు జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధించారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వజ్రాల రాజశేఖర్ రెడ్డి వాదనలు వినిపించారు.

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండాదండ

నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం రూరల్ మండలం, అర్బన్ డివిజన్స్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా నేటికి పేదవానికి ఒక్క సంక్షేమ పథకం అందలేదని గుర్తు చేశారు. కరోనా విపత్కర పరిస్థితిలో సైతం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు నేరుగా అందించిన విధానాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో కల్లబొల్లి కబుర్లు చెప్పి సూపర్ సిక్స్‌తోపాటు మోసం చేసిందని తెలిపారు. జగనన్న ఇచ్చిన ప్రతి పథకాన్ని అందిస్తామని చెప్పారని, కానీ నేడు ప్రభుత్వం వద్ద నిధులు లేవని కపట నాటకాలు ఆడుతున్న వైనాన్ని వివరించారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో పేదలకు అండగా, వారి సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ తోడుగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యకర్తలంతా ఐకమత్యంగా ప్రజలకు చేరువ కావాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి కార్యకర్తా, నాయకుడు ముందుండాలని చెప్పారు. రానున్న రోజుల్లో జగనన్న చేపట్టబోవు ప్రతి పోరాటంలో కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని, పేదలకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ మండలం, అర్బన్ డివిజన్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యల తిష్ట



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కాకుమాను: కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అనేక సమస్యలను గుర్తించామని, వెంటనే వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై సోమవారం నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కాలనీల్లో మురుగునీరు, శ్మశానవాటికలు, కొత్త రేషన్ కార్డుల సమస్యలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా 15 ఎస్టీ కుటుంబాలు పూరి గుడిసెల్లో నివసిస్తున్నాయని, వారికి ఆధార్, రేషన్ కార్డులు లేవని చెప్పారు. ఆయా కుటుంబాల సమస్యలను పరిష్కరించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కొత్త వెంకట శివరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర, మర్రి లక్ష్మి, షేక్ షమీ, పి.భువనేశ్వరి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుంటూరు రూరల్: నైపుణ్యాలే ఉద్యోగ అవకాశాలకు ప్రధాన మార్గమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని తెలిపారు. వివిధ కంపెనీల ప్రాంగణ నియామకాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఇప్పటి వరకు 753 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. చౌడవరంలోని కళాశాలలో బెంగుళూరుకు చెందిన ఇన్గటి సాఫ్ట్‌వేర్, చెన్నైకి చెందిన జీజీఎస్ ఇంజినీరింగ్, తెలంగాణలోని ఉస్సై ఫోర్జ్ కంపెనీలు సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు వ్యక్తిత్వ నైపుణ్య శిక్షణ తరగతులు ఉద్యోగాల సాధనకు సహకరించాయని కళాశాల కార్యదర్శి ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్గటి సాఫ్ట్‌వేర్ కంపెనీ నియామకంలో ఎంపికైన విద్యార్థి రవిశంకర్‌కు రూ. 5-7 లక్షల ప్యాకేజీతో ఉద్యోగంతో పాటు, ఇంటర్న్‌షిప్ సమయంలో రూ 31 వేల స్టైఫెండ్ అందుకోనున్నట్లు తెలిపారు. జీజీఎస్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ నియామకంలో విద్యార్థిని బి. లక్ష్మీచైత్ర రూ 3.6 లక్షల ప్యాకేజీతో ఎంపికైందని చెప్పారు. ఉస్సై ఫోర్జ్ కంపెనీ నియామకాలలో విద్యార్థులు బి.రమణ, ఎం.వి. సాయికిరణ్, వై. హేమంత్‌కుమార్, జి. రాకేష్, ఎం. నరేంద్రరెడ్డి, ఆర్. పవన్‌లు రూ2.4 లక్ష ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్. శ్రీనివాసరావు, కె. సురేష్‌బాబు అభినందించారు.

పలు దుకాణాల్లో చోరీ

పట్నంబజారు: షాపు షట్టర్లు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. సంపత్‌నగర్‌లో నివాసం ఉండే పి.దుర్గాసతీష్ విద్యానగర్‌లోని వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. అతడి తల్లి రామలలిత, తండ్రి బ్రహ్మానందచారి సంపత్‌నగర్‌లో నాలుగేళ్లుగా టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు షట్టరు పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలకు వెళ్లి చూడగా, రూ.25 వేలు, పలు బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీరి షాపు ఎదురుగా ఉన్న మెడికల్ షాపు షట్టరు పగులగొట్టి రూ.5 వేలు, బంగారు, వెండి ఆభరణాలు దోచుకుపోయారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆప్రాంతంలోని పలు షాపుల్లో చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వెల్లడించారు.

క్షయను ముందుగా గుర్తిస్తే నివారణ



పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

చేబ్రోలు: క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. అబ్రహాం లింకన్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది క్షయ వ్యాధిని అంతమొందించడమే లక్ష్యంగా, ప్రతి ఒక్కరినీ చైతన్యవంతులు చేసే విధంగా సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అబ్రహాం లింకన్, సీహెచ్. శైలజ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టీబీ ఉందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఉచిత మందులు, పౌష్టికాహారం నిమిత్తం ఆర్థిక సహాయం ద్వారా సురక్షితంగా జీవించవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాత్ర కీలకం



సదస్సులో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్

గుంటూరు రూరల్: నేడు ప్రతి రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాత్ర కీలకమని వీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్‌పర్సన్ సింధూర తెలిపారు. మండలంలోని బుడంపాడులోగల జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఎట్టయిన్ స్మార్ట్ సొల్యూషన్స్, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అంశాలపై జాతీయ స్థాయి సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్‌పర్సన్ సింధూర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నేటి పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉండాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ సూర్యప్రకాష్ నిజ జీవితంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ప్రాముఖ్యతను వివరించారు. సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు నిత్యం నేర్చుకుంటూనే ఉండాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు, కష్టపడే దృక్పథాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఓ. కరిముల్లా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ద్వారా నేడు ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. భాస్కర్ నాయుడు, డీన్ బి. వరప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న బహిరంగ వేలం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, టాయిలెట్స్‌ల టెండర్, బహిరంగ వేలం ఈ నెల 27న నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంలో ఇప్పటికే ఉన్న లీజుదారులు కూడా బకాయిలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.100 చలానా చెల్లించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఏ-2 గుమస్తా వద్ద నుంచి టెండర్ షెడ్యూల్ పొందవచ్చని తెలిపారు. వివరాలకు డెప్యూటీ కమిషనర్ (9849908364)ని సంప్రదించాలని ఆయన సూచించారు.

ఏఎన్‌యూ లైబ్రేరియన్ విజయకుమార్ మృతి



విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ గంగాధరరావు, రత్నషీలామణి

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లైబ్రేరియన్ డీబీ విజయకుమార్ మృతి తీరనిలోటు అని పలువురు పేర్కొన్నారు. వర్సిటీలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆయన మృతి చెందారు. యూనివర్సిటీలో పలు హోదాల్లో విధులు నిర్వహించిన విజయకుమార్ ప్రస్తుతం యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సంతాప సభలో వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, జె.శ్రీనివాసరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య, బాబూ జగ్జీవన్‌రామ్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు పీజే రత్నాకర్, ఎం.త్రిమూర్తిరావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, వై.రాధాకృష్ణ పాల్గొని విజయకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ అధికారులు, ఉద్యోగులు గుంటూరులోని విజయకుమార్ స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.

మాదిగలను మోసం చేస్తున్న చంద్రబాబు



మాట్లాడుతున్న బ్రహ్మయ్యమాదిగ

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ పేరుతో సీఎం చంద్రబాబు మరోసారి మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలో చంద్రబాబునాయుడు వర్గీకరణ అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ అమలు చేసి.. వచ్చే సంవత్సరం నుంచి జిల్లా యూనిట్‌గా అమలు చేస్తామని ప్రకటించడం అంటే మాదిగలను నట్టేట ముంచి మాలలకు మేలు చేయాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వం..ఆ తరువాత మండలిలో చర్చకు తీసుకురాకుండా వైఎస్సార్ సీపీ వర్గీకరణపై మాట్లాడటం లేదని మంద కృష్ణ మాదిగ మాట్లాడటం సిగ్గుచేటని ఖండించారు. ముందు మండలిలో చర్చకు తీసుకొచ్చి ఆ బిల్లులను ఆమోదించుకోవాలని కోరారు.


మట్టి కోసం చెరువులో నీటి తొలగింపు

కలెక్టర్ గ్రీవెన్స్‌లో మన్నవ సర్పంచ్ ఫిర్యాదు

పొన్నూరు: ధన దాహంతో గతంలో తవ్విన చెరువునే మరలా తవ్వి జేబులు నింపుకునేందుకు గ్రామ టీడీపీ నేతలు సిద్ధమయ్యారని మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. చెరువులో నీళ్లు తోడేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి అవసరాల కోసం దళితవాడలోని 10 ఎకరాల ఊర చెరువులో గ్రామ పంచాయతీ ఊరి అవసరాల కోసం నీరు పుష్కలంగా నిల్వ చేసి ఉంచిదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అక్రమార్జన కోసం దారులు వెతుకుతున్న ఆ గ్రామ టీడీపీ నాయకుడు బండ్లమూడి చింపిరయ్య కన్ను ఆ చెరువుపై పడిందని నాగమల్లేశ్వరరావు ఆరోపించారు. 2019 టీడీపీ ప్రభుత్వంలో ఇదే ఊర చెరువులో మట్టిని అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకున్న చింపిరయ్య, మరలా పుష్కలంగా ఉన్న నీటిని నాలుగు ఆయిల్ ఇంజన్లతో దౌర్జన్యంగా బయటకు తోడేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతులు, తీర్మానం లేకుండా దౌర్జన్యంగా చెరువులో నీటిని తోడేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోని చెరువులో నీటి తొలగింపుకు అడ్డుకట్ట వేయాలని సర్పంచ్ నాగమల్లేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వేసవిలోనూ మూత్ర సమస్యలు

- అప్రమత్తంగా ఉండాల్సిందే..
- నీరు తాగకపోతే కిడ్నీలో రాళ్లు



గుంటూరు మెడికల్: వేసవి కాలం ప్రారంభమైందంటే మూత్ర సంబంధిత సమస్యలు కూడా మొదలవుతాయి. ఎండ తాపం పెరిగే కొద్దీ శరీరంలో నీటి శాతం తగ్గిపోవటం, తగ్గిపోయిన నీటి శాతాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు సరిపడ నీరు తాగకపోవడం వలన సమస్యలు రోజురోజుకు అధికమవుతాయి. కిడ్నీలో రాళ్లు ఏర్పడుతాయి. సైజు పెరిగే కొద్ది బాధ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. రాళ్లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రాళ్లు ఏర్పడడానికి కారణాలు

కుటుంబంలో ఎవరికైనా కిడ్నీలో రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకోవడం, లేదా వైద్యం తీసుకుంటూ ఉన్నట్లయితే మిగతా సభ్యులు కూడా ఏమాత్రం ఆలోచించకుండా మూత్ర పిండాలు పరీక్ష చేయించుకోవడం చాలా ఉత్తమం. వారసత్వంగా కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పుట్టుకతో కిడ్నీలో తేడాలు ఉండటం వలన కూడా రాళ్లు ఏర్పడతాయి. శరీరం తీరు కూడా ఒక కారణం.

వయసుతో సంబంధం లేదు

కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి వయసుతో సంబంధం లేదు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరిలో కూడా రాళ్లు ఏర్పడతాయి. ముఖ్యంగా 22 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారిలో, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు వారిలో హార్మోనుల్లో తేడాల వలన రాళ్లు ఏర్పడతాయి. మూడు మిల్లీమీటర్ల నుంచి కిడ్నీ సైజు వరకు ఏర్పడతాయి. రాళ్లు ఏర్పడిన వారికి నడుము పక్కన నొప్పి, నొప్పితోపాటు జ్వరం వస్తుంది. మూత్రంలో రక్తం కారడం, వాంతులు అవడం, నొప్పి వచ్చిన సమయంలో మనిషిని మెలేసినట్లుగా ఉంటుంది.

ఆధునిక వైద్య పద్ధతులు



కిడ్నీలో రాళ్లను తొలగించేందుకు నేడు ఎన్నో వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఒక సెంటీమీటర్ కన్న తక్కువ సైజులో ఉండే రాళ్లకు ఆపరేషన్ అవసరం లేదు, నీరు ఎక్కువగా తాగడం వలన మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. ఒక సెంటీమీటర్ సైజులో ఉండే రాళ్లు తొలగించేందుకు 'ఎక్స్‌ట్రా కార్పోరియల్ షాక్ వేవ్ లిథోట్రిప్సీ' (ఈఎస్‌డబ్ల్యూ) వైద్య విధానం అందుబాటులో ఉంది. ఈ విధానంలో కిడ్నీ ఒక శాతం దెబ్బతినే అవకాశం ఉంది. నూతనంగా లేజర్ ట్రీట్‌మెంట్ రిట్రోగ్రేడ్, ఇంట్రారీనల్ సర్జరీ(ఆర్ఐఆర్ఎస్) అందుబాటులోకి వచ్చింది. ఈ విధానంలో మూత్ర నాళం గుండా కిడ్నీ గదుల్లోకి లేజర్ ఫైబర్ పంపి రాయిపై కిరణాలు ప్రసరింప చేసి పగులగొట్టి అక్కడి నుండి బక్కెట్ ద్వార బయటకు తీస్తారు.

– డాక్టర్ పోలుమట్ల జ్ఞానప్రకాష్, యూరాలజిస్ట్


రోగులు జాగ్రత్తలు పాటించాలి



మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడి ఆపరేషన్ చేయించుకున్నవారు జాగ్రత్తలు తీసుకోకపోతే మళ్లీ ఐదేళ్లల్లో రాళ్లు వచ్చే ప్రమాదం ఉంది. ఆపరేషన్ చేయించుకున్నవారు ఆహార నియమాలు పాటించాలి. కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వార పోటాషియం, మెగ్నీషియం లభించి మూత్ర పిండాల్లో తిరిగి రాళ్లు ఏర్పడకుండా నివారించవచ్చు. క్యారెట్లు, కాకరకాయ తీసుకోవడం వలన మినరల్స్ పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి. అనసపండు రసం, బార్లీ, ఓట్లు, నిమ్మరసం తాగడం వలన సైట్రిట్‌లు పుష్కలంగా లభించి రాళ్లు ఏర్పడకుండా నివారిస్తుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రతిరోజూ మూడు లీటర్లు నీరు తాగాలి.

– డాక్టర్ జె.కొర్నెలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

ఎస్‌పీఎం సెమినార్ హాల్ ఆధునికీకరణ



హాలును ప్రారంభిస్తున్న డాక్టర్ సీతారామ, డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజీ సామాజిక వైద్యవిభాగం(ఎస్‌పీఎం) సెమినార్ హాల్‌ను ఆధునికీకరించి సోమవారం ప్రారంభించారు. విభాగాధిపతి డాక్టర్ సీతారామ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. శ్రీ హాస్పిటల్ రిజెనరేటివ్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ ఎ.విజయరాజేష్, కార్డియాలజీ హెచ్ఓడీ డాక్టర్ బి.నారాయణ రెడ్డి రెండు ఏసీలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయరాజేశ్ మాట్లాడుతూ, కాలేజీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత సహకారం అందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ సహకారంతో పరిశోధన కార్యక్రమాల నిమిత్తం విభాగానికి ఆరు కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి నాయకత్వంలో కాలేజీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. డాక్టర్ ఏ సీతారామ మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి తోడ్పడుతున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

35 ఏళ్ల తర్వాత కలిసిన ఏపీ జైలు శాఖ అధికారులు



1990 బ్యాచ్ సభ్యుడికి సత్కారం

నగరంపాలెం: చెన్నై వెల్లూరులోని రీజినల్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందిన 1990 బ్యాచ్ ఏపీ జైలు శాఖ అధికారులు 35 ఏళ్ల తర్వాత కలిశారు. గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశమై పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 60-76 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు కలవడం ఆనందంగా ఉందని విశ్రాంత డీఎస్పీ కేవీ నారాయణ అన్నారు. గత శిక్షణ, తర్వాత జైళ్లలో పరిపాలన అభివృద్ధిని నెమరవేసుకున్నారు. ఆ బ్యాచ్‌లో ఇద్దరు డెప్యూటీ జైలర్లు 1991 బ్యాచ్ సివిల్ ఎస్ఐలుగా ఎంపికయ్యారని గుర్తు చేసుకున్నారు. సమావేశంలో వైజాగ్ డీఎస్పీ సీహెచ్. పెంటారావు పాల్గొని పలువురిని సత్కరించారు.

13 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు



కలెక్టర్ నాగలక్ష్మితో కారుణ్య నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదని ఇదొక సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 13 మందికి కారుణ్య నియామకాల కింద గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు వివిధ శాఖలో పోస్టింగ్ చేస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.